వేమూరి వారి కోడలు

కోడికూసినప్పుడు లేచిన కామాక్షమ్మ 'గంగాదేవి మేలుకొలుపు పాటలు' పాడుతూ చల్లచేయుటము ప్రారంభించింది. నాలుగు బర్రెల పాడిగనుక అరగంటకు పైగా పట్టింది వెన్నతీయటానికి. వెన్నముంత, పెరుగుకుండ ఉట్టిమీద సర్ది ఆమె పెరట్లోకి వచ్చేసరికి అరుణరాగాలతో బాలభాస్కరుడు తూరుపుదిశనుండి తొంగి చూస్తున్నాడు.

మిగతా పాచిపను లన్నీ కోడలికి ఒప్పచెప్పి, పెరట్లో పడమటిదిశగాఉన్న జేమచెట్టు దగ్గరకు వెళ్ళింది కామాక్షమ్మ. ఆకుకూరల మడి చెట్లపాదులు వేసి శ్రద్ధగా నీళ్ళుపోసి పెంచుతూ ప్రతిఉదయమూ వాటి అభివృద్ధిని చూసి ఆనందపడుతూ ఉంటుంది. చెట్ల నన్నిటినీ పరిశీలించి ఏదో ఒకటి కోసి ఆరోజు వంటలోకి ఉపయోగిస్తూ ఉండటమువల్ల చెట్లముఖము చూస్తేనే గాని ఆ పూట చెయ్యవలసిన వంటకాలు నిర్ణయమయేవి కావు. ఈ పాదులకు కొంచెం మవతల పెద్ద జామ చెట్టొకటి ఉన్నది. పిందెలు పడి కాస్తఎదుగుతున్న దగ్గరనుండే వాటిని కాపాడటము పెద్ద పనిగా ఉన్న దామెకు, పిందెలు దోరకాయలుగా మారిన తరువాత రెండుదినాల క్రిందట నాలుగు గజాలబట్ట చింపి దృష్టి తగులక్కుండాసూ చిలుకలు కొరక్కుండానూ ఆ కాయలకు కట్టి వేసింది. రోజూ తెల్లవారి లేవగానే కట్టిన బట్టలన్నీ సరిచూసు కుంటూ ఉంటుంది.

ఆరోజు బచ్చలికూర ఏరి పప్పులో వేయాలని చేట చేత పట్టుకొని మడి దగ్గరకు వెళ్ళుతూ జామచెట్టువైపు దృష్టిని పోనిచ్చింది. చూసీ చూడటముతోటే ఆమె గుండె అదరి పోయింది?

గత రాత్రివరకూ వంటయింటి వసారాలోకి కూడా స్ఫుటంగా కనబడ్డ జేమకాయలకు కట్టిన బట్టలు, ఇప్పు డామె కంటికి రెండు తక్కువనిపిస్తున్నాయి! తెల్లవారేలోపల జరిగిన ఈ పని ఎవరిదై ఉంటుంది? ఈ ఆలోచనలో ఆమె కను

బొమలు కలుసుకొన ప్రయత్నించాయి. ఆమెదృష్టి నిశితమైన రెట్టింపు వేగముతో గోడదాటి నైరుతిదిశగా ఉన్న సుంకరవారి పెంకుటింటిమీద పడ్డది.

నిమిషము తడవులో కామాక్షమ్మ బయటికి వినబడని మంత్ర మొకటి పళ్ళుకొరుకుతూ జపించి-చేతి వేళ్ళను లోపలికి మడచి, ఒక చేతి కొకటి తాకిస్తూ పటపటలాడించింది.

ఆమె ప్రాణము ఉసూరుమన్నది. అనకాపల్లినుండి ప్రత్యేకముగా తెప్పించి వేసిన జామచెట్టు అది. దాని కాయలు చిన్న కొబ్బరికాయలంత పరిమాణములో ఉంటాయి. తగిన ఎరువు వేస్తూ, జాగ్రత్తగా నీళ్ళుపోస్తూ కామాక్షమ్మ పెంచు తున్నదా వృక్షాన్ని దాని మొదటికాపు ఇంటి యజమాని ఆఖరు రోజులలో వచ్చింది. 'పెరట్లో కాసిన కాయగదా ! ఆయనకు పెట్టకుండా ఎట్లా తినట మని ఆపేక్షకొద్దీ జబ్బుగా ఉన్న పెనిమిటికి ఎవరూ చూడకుండా పెట్టింది. ఆయన చనిపోయిన తరువాత కొన్ని వస్తువులతోపాటు పెరటిలోని ఈ జామచెట్టుకూడా ఆమెకు బహిః ప్రాణమయింది.

'ఇంతకూ ఎన్ని గుండెలు ఉండాలి....రాత్రి వేళ ఎవరూ చూడకుండా పెరట్లో ఉన్న జామచెట్టుమీద చెయ్యి వేసి, గుడ్డ చుట్టిఉన్న రెండుకాయలు కోసు కొనిపోవటానికి ?

ఆమె కొక అనుమానము తోచి....రెండు మూడు క్షణములలో దృఢపడి పోయింది. ఆమె కోపారుణ నేత్రాలలోనుండి రెండు అగ్నిబాణాలు నైఋతిదిశగా బయలుదేరినవి.

సుంకర చంద్రమ్మగారి కోడలికి రెండేళ్ళ క్రిందట పుట్టిన కొడుకు కాక తిరిగి గర్భము నాలుగవనెల, బహుశః ఏమిటి....తప్పకుండా ఆమెకు రుచిచూపటా నికే ఈ కాయలు అపహరింప బడినట్లుగా కామాక్షమ్మ మనోవీధిన ఋజువయి పోయింది. దానికి తగిన పరిహారము కొరకు ఆమె మనసు అహోరాత్రాలు విద్యు ద్వేగముతో పనిచేయ నారంభించింది.

* * * * *

కామాక్షమ్మ వేమూరివారి కోడలు. నిండుమనసుతో తీయటి కోరికలతో సర్వాంగసుందరమైన దేహముతో పదిహేనవ ఏట ఆమె అత్తవారింటికి వచ్చింది.

సుంకరవారింటి కోడలు చంద్రమ్మ, వేమూరివారి కోడలు కామాక్షమ్మ పది రోజులు తేడాగా అత్తవారిళ్ళలో పాదము పెట్టారు.

ఆ గ్రామములో సుంకర రమణయ్య కరణమూ, వేమూరి భావయ్య మునసబూ. ఇద్దరు అన్నదమ్ములలా ఉంటూ ప్రతి విషయానికి ఒకరి నొకరు సంప్రదించుకుంటూ ఉండేవారు.

ఈ యింటికీ ఆయింటికీ కోడళ్ళు జంటగా రావడమువల్ల ఆ గ్రామములోని అంగనలు తీరిక దొరికినప్పుడూ సీలాటిరేవులోను కోడళ్ళ చక్కదనాన్ని గురించి వారు తెచ్చిన సారెలను గురించీ సమీక్షలు చేయటము మొదలుపెట్టారు.

"కామాక్షమ్మ ముఖము చూస్తేనే కడుపు నిండుతుంది. కళ్ళల్లో లక్ష్మి తాండవమాడుతున్నది" అని దీక్షితులగారి భార్య అనీ అనకముందే "ఏం బాగుంది ఆ పిల్ల ముఖము? తెలుపయినా కంటికింపుగా ఉండద్దూ? చామనఛాయలో కూడా కళగల ముఖము సుంకరవారి చంద్రమ్మది. నీ వెన్నన్నా అను లక్ష్మీదేవి అడుగు పెట్టినట్టుగా పెద్దఎత్తులో సారె తెచ్చింది. గదిసామానులు కూడా బోలెడుతెచ్చింది" అని పదిమంది తోటిస్త్రీలూ కలిసి నిర్ణయము చేసేశారు.

మరునాటికల్లా సుంకరవారి కోడలు కలవారియింటి ఆడపడుచు కనుక నలుగురి నోటా మంచిదయి, సుందరి అయి గ్రామంలో పేరుపొందింది వాయు ప్రసారముతో పాటు ఈవార్తలు కామాక్షమ్మ అత్తగారి చెవులకు సోకినవి. అంత వరకూ కామాక్షమ్మ కాలిమట్టెల రవళితో రాగాలాపనిచేసే అత్తమామల హృదయాలు మారి అసంతృప్తిఛాయలు వాళ్ళ ప్రవర్తనలో ద్యోతకమవుతూ ఉండేవి.

క్షణంకపాటయినా విరామమెరుగకుండా శరీరకష్టము చేసి చూపింది కామాక్షమ్మ వినయవిధేయతలతో అత్తమామలకూ భర్తకూ శుశ్రూషలు చేసింది. కాని ఎంతచేసినా వాళ్ళదృష్టిలో సుంకరవారి కోడలు అందకత్తె - పెద్దఎత్తులో సారె తెచ్చినదీ కామాక్షమ్మ అందవికారము గల పేదయింటి బాలికాను.

ఇట్లా ఉండగానే సుంకరవారి కోడలు కాపురానికి వచ్చిన రెండేళ్ళకే పండు వంటి పాపడు పాలబుగ్గలతో నట్టింట అంబాడుతూ జనముద్దుబిడ్డడై నాడు.

"వస్తు సామగ్రితో అడుగుపెట్టిన కోడలు మనమలతో ఇల్లు కళకళ లాడిస్తున్నది సుంకరవారి చంద్రమ్మ. మన పెద్దమ్మ చూడు వట్టిచేతులతో ఇంట ప్రవే

శించింది. ఇంత మటుకు బిడ్డాలేదు పాపాలేదు" అవి దినానికి పదిసార్లయినా ఆ విషయాన్ని నెమరుకు తెచ్చుకొనేవారు కామాక్షమ్మ అత్తమామలు. అడుగడుగునకు తిట్లు శాపనార్థాలు కామాక్షమ్మకు తగులుతూ ఉండేవి అప్పటినుండీ.

దైవికముగా తనపట్ల జరిగే పక్షపాతమునకు కామాక్షమ్మ ప్రారంభములో లక్ష్యపెట్టలేదు గాని నానాటికి హైన్యదశను పొందుతున్న ఆమె దైనిక జీవితము రానురాను దుర్భరమయిపో నారంభించినది. అది మొదలు ఆ యింటి మట్టి నేల కామాక్షమ్మ కాళ్ళకు కాలిన ఇనుపరేకు వలె చురచుర మండ నారంభించినది. శిరీష కుసుమకోమలమైన ఆమె హృదయము క్రమముగా రాటుదేలి జుగుప్సాయసూయలకు అలవాలమై పోయింది. అమృతమయమై, అనురాగమునకు నిలయమైన ఆమె హృదయము విషసంకీర్ణమయిపోయింది.

కాలము నిర్మొగమాటి. కామాక్షమ్మ పరిస్థితులతో సానుభూతి చూపించకుండానే....నిర్దాక్షిణ్యముతో నడచిపోతూనే ఉన్నది.

"తోటివారి అదృష్టము చూడు....ఏది ఎట్లా ఉన్నా కడుపున ఒకకాయకాస్తే అయినా బాగుండును" అని తలపోసి తలపోసి కామాక్షమ్మమామగారు దాటిపోయినాడు.

మరు సంవత్సరము పంటలో నష్టము వచ్చింది: "ఇనుపగజ్జెల తల్లి ఇంట ప్రవేశించిన దగ్గర నుండీ అంతా తుడుపే" అంటూ అత్తగారు సాధించిపోసింది

కామాక్షమ్మ మనసు సాధింపులకు కాఠిన్యపడి శిలామయ మయిపోయింది.

అత్తవారిళ్ళలో అడుగుపెట్టటము తోనే ప్రతి విషయములోను పోటీలు రావడము వల్ల కామాక్షమ్మకు చంద్రమ్మకు సన్నివేశాలు సమావేశాలు కలుగనే లేదు. సుంకరవారి కోడలిని ఉదయాస్తమానాలు పొగిడి పూజించినకొద్దీ...తన దురదృష్టాని కంతకూ ఆమె కారకురాలన్న అపోహ బీజరూపమున కామాక్షమ్మ ఎదలో నాటుకొనిపోయి నీరుచల్లిన నారువలె పెరుగ నారంభించింది. దీనికి పర్యవసానముగా చంద్రమ్మతో పరిచయములేని కామాక్షమ్మ చంద్రమ్మ విషయము రాగానే అడత్రాచు వలె కస్సుమనటమూ అపశ్రుతిగా మాట్లాడటమూ ప్రారంభించింది.

తరువాత కొద్దికాలానికే కామాక్షమ్మ గర్భము ధరించినా అత్తగారు చూచి ఆనందించే భాగ్యము కలుగలేదు. బిడ్డ తల్లి అయినా కామాక్షమ్మ హృదయము మార్పు చెందలేదు.

పోయినంత పొడుగునా పెద్దమ్మవారి సాహచర్యము కామాక్షమ్మకు తప్పినట్లులేదు! ఒక్క క్షణమయినా విడిచి ఉండని ప్రేమ కాబోలు! కామాక్షమ్మకూ చంద్రమ్మకూ కోడళ్ళు వచ్చారు. ఈతరములో కూడా గెలుపు చంద్రమ్మదే! ఆమె కోడలే ముందుగా బిడ్డల తల్లి అయింది.

*   *   *   *

జామకాయల దొంగతనము జరిగిననాటి నుండీ కామాక్షమ్మ హృదయావేదన ప్రజ్వలిస్తూనే ఉన్నది. అక్కసుతోనే ఆమెకు కడుపు నిండిపోయింది.

చీకటిపాటున ఊరిబయట ఉన్న మాల శాయన్నను సలహా అడిగి చంద్రమ్మ కోడలిగర్భము విచ్ఛిత్తుకావడానికి తుడుపు మంత్రాలతో గుమ్మడికాయను భూస్థాపితము చేయించింది గాని ఏమి పొరపాటు జరిగిందో మరి....నవమాసములు నిండిన తరువాత చంద్రమ్మ కోడలు చక్కటి పిల్లవాడిని కన్నది.

అప్పటి నుండి తిరిగి నూతనోపాయాల కొరకు కబుర్లు మాల శాయన్నకు చేరుతునే ఉన్నాయి. ఏవిధాన గానీ చంద్రమ్మకు నష్టము కలగాలి - కామాక్షమ్మ నిద్రపోవాలి.

నాలుగురూపాయలు చేతవేసుకొని చేరెడు గన్నేరుపప్పులు పంపాడు శాయన్న-తినే పదార్థాలలో నూరి కలిపితే ఆమె కోరికలు ఈడేరుతాయని.

ఈ యింటిమీద కాకి ఆ యింట వాలక ఎన్ని సంవత్సరాలయినదో! ఈ తినుబండారము వాళ్ళకు చేరే మార్గమూ పట్టుబడని విధమూ ఎంత యోచించినా కనబడక కొట్టుకుంటున్న కామాక్షమ్మ సుంకరవారిమనుమడిని చాకలివాడు సాయంత్రవేళ ఎత్తుకొని బజార్లవెంట తిప్పటము గమనించింది. మరునాటి సాయంత్రము గారెలు చేసేటప్పుడు ప్రత్యేకముగా రెండు గారెలను గన్నేరుపప్పులు కలిపి చేసి సిద్ధముగా వాకిట నిలబడి ఎదురుచూస్తున్నది.

సుమారు ఆరుగంటలవేళ తెల్లటి నుదుటిమీద నల్లటి చాదుచుక్క పెట్టుకొని దోరమామిడిని మించిన తొక్కు పలుకులతో చూపరులను మురిపిస్తూ చాకలివాని చెయ్యిపట్టుకుని రెండేళ్ళ బాలుడు ఆవీథిన వస్తూ ఉండటము ఆమెకంటపడ్డది.

వెంటనే ఆమె అరుగుమెట్లు దిగి వాకిలిదాటి బాలుని సమీపించి "ఎంత ముద్దుగా ఉన్నావురా బాబూ! ఎత్తుకుంటాను వస్తావా?" అంటూ బలవంతముగా చంకబెట్టుకొన్నది.

చాకలివాడు వద్దంటూనే ఉన్నాడు. పిల్లవాడు రానని మెలికలు తిరుగుతూనే ఉన్నాడు ఆమె వేటినీ లక్ష్యపెట్టకుండా తిన్నగా వంటయింటిలోకి వెళ్ళి ప్రత్యేకముగా తీసిపెట్టిన గారెల కొరకు చూసింది. పాపిష్టిపిల్లి కాబోలు బోర్లించినపళ్ళెము మీదికి దూకినట్లున్నది-ప్రత్యేకముగా తీసిపెట్టిన గారెలు రెండూ గిన్నెలో ఉన్న గారెలతో కలిసిపోయినవి.

మానసికముగా బయలుదేరిన ఆందోళనను ప్రయత్నపూర్వకముగా తగ్గించుకొని.... ఆ గిన్నెడు గారెలలో నుండి ఏరిఏరి రెండు గారెలను పిల్లవానిచేత తినిపించి గ్లాసెడు నీళ్ళు త్రాగించి 'వెళ్తావా బాబూ!' అంటూ చాకలివాని చేతికిచ్చింది.

తెల్లవారి ఎండ ఎక్కినా తల్లి లేవలేదు. కారణమేమని కొడుకు చేతితో తట్టి లేపబోతే చల్లగా తగిలింది కామాక్షమ్మ దేహము.

ఆందోళనతో వైద్యుని పిలిపించి చూపించాడు.

"ఒక రాత్రివేళ ప్రాణము పోయి ఉంటుంది. ముందుగా తెలిస్తే ఏదయినా ప్రయత్నము చేసేవాడిని" అన్నాడు వైద్యుడు.

"ఆమె కేమి జబ్బులేందే ముందుగా ఎట్లా తెలుపను? రాత్రి నాకు భోజనము పెట్టి తాను గారెలు ఫలహారము చేసికొన్నది. ఎప్పటివలె లేస్తుందనుకున్నాను" అంటూ కొడుకు కంటతడి పెట్టాడు.